మర్డర్ కాంట్రాక్ట్!

మల్లేశ్వరరావు

ఫిబ్రవరి నెల సప్లిమెంట్ లోని వసుంధర నవల చదువుతూ సోఫాలో కూర్చుంది పార్వతి.

గణ గణమంటూ ఫోన్ మ్రోగింది.

పుస్తకం పక్కనపడేసి, రిసీవరెత్తి "హలో! పార్వతీ స్పీకింగ్" అంది.

"పార్వతీ! నేను అర్జంటుగా విశాఖపట్నం వెళ్ళాలి. సూట్ కేస్ సర్ది పెట్టి వుంచు. అరగంటలో యింటికి వస్తాను" శేఖరం గొంతు వినిపించింది ఫోన్ లో.

"నిజంగా వెళుతున్నారా?" అడిగింది భర్తను.

"అవును నిజంగానే."

"ఎందుకూ?" ఉన్నట్టుండి ఎందుకు వెళ్ళాలనుకుంటున్నాడో అర్థంకాలేదామెకు.

"చిన్నపని వుంది."

"ఏమిటా పని?"

"అవన్నీ తర్వాత చెబుతాను."

"ఏం? ఎందుకో?"

"చెబితే వెళ్ళనివ్వవు గనుక."

"మళ్ళీ దొరగారు తిరిగిరావడం ఎప్పుడు?"

"చెప్పలేను."

"పోనీ, నేనూ మీతో వస్తాను. తీసుకెళ్ళరాదూ?"

"వద్దు."

"అంత సీక్రెటా? లేక నేను రాకూడదనిదా?"

"రెండూ కాదు."

"మరి నేను కూడా వస్తే ఏం?"

ఒక్క క్షణం ఫోన్‌లో నిశ్శబ్దం.

"ఆల్ రైట్! సిద్ధంగా వుండు. నేను రాగానే కార్లో ఎక్కిపోవాలి..."

"ఓ.కే." అంది. ఫోన్ క్లిక్‌మంది.

పార్వతి ఫోన్ పెట్టేసింది.

నగరంలో పెద్ద బిజినెస్ మాగ్నెట్‌లలో ఒకడైన రాజశేఖరం భార్య పార్వతి. అతని స్వస్థలంలోని వ్యాపారమే గాకుండా, విశాఖపట్నంలో ఒక బ్రాంచి వున్నది. ఆ బ్రాంచిని అతని ప్రాణమిత్రుడైన పరాంకుశం చేతిలో పెట్టేడు. పరాంకుశం తెలివితేటలమీద, వ్యాపార నిర్వహణా చాతుర్యంమీద అతనికి నమ్మకం వుంది. అందు

కనే సంవత్సరానికోసారి విశాఖపట్నం వెళ్ళి పుస్తకాలు చూసి వస్తుంటాడు. అదీ నామకానికే!

పార్వతి సూట్ కేస్ సర్దడంలో మునిగిపోయింది.

అరగంట తర్వాత యింటిముందు కారాగింది.

కారాగిన వెంటనే ఇంటికి తలుపుతాళం వేసుకువచ్చి రాజశేఖరం ప్రక్కన కూర్చుంది పార్వతి. డ్రైవరు సూట్ కేస్ తీసుకువచ్చి లోపల పెట్టేడు.

ఏర్ పోర్టువేపు దూసుకుపోయింది కారు.

2

సరిగ్గా నాలుగ్గంటలకి విమానం గోపాలపట్నం ఏర్ పోర్ట్‌లో ఆగింది.

రాజశేఖరం వెలుపలికొచ్చేడు. టాక్సీనిపిలిచి సూట్ కేస్ అందులో పడేసి ఎక్కేడు. పార్వతి అతని ప్రక్కన కూర్చుంది.

"సీతమ్మధార" అన్నాడు.

టాక్సీ రివ్వున దూసుకుపోసాగింది. యిరవై నిము షాల్లో టాక్సీ తమ బంగళాముందు ఆగింది. ఫేర్ చెల్లించి యిద్దరూ దిగేరు.

బంగళాముందు కారు ఆగడంతో నే నౌకరు రంగయ్య పరిగెత్తుకుంటూ వచ్చేడు.

కార్లోవున్న సూట్ కేస్ అందుకుని బంగళాలోనికి తీసుకువెళ్ళాడు రంగయ్య.

రాజశేఖరం, పార్వతి సోఫాలో కూలబడ్డారు.

'హమ్మయ్యా' అని నిట్టూర్చింది పార్వతి.

ఎన్నడూ రాజశేఖరం యింత ముభావంగా వుండడం

చూడలేదు పార్వతి. అందుకే ఆశ్చర్యపోతోంది. అతని మౌనానికి కారణమేమిటో తెలియడంలేదు.

"ఏమండీ! నేను స్నానంచేసి వస్తాను," అని లేచింది పార్వతి.

"వెళ్ళు. నాకు ఓ చిన్నపని వుంది. యీలోగా అది పూర్తిచేసుకుని వస్తాను."

మాట్లాడుతూనే లేచి మొహం కడుక్కున్నాడు. కాస్త టాయ్‌లెట్ అయి, మెట్లుదిగి బంగళాలోనుంచి బయటపడ్డాడు. తలుపులు మూసి మేడమీదకు వెళ్ళింది పార్వతి.

టాక్సీ ఆపి ఎక్కాడు రాజశేఖరం.

3

ఉదయం ఎనిమిది కావస్తూంది.

పోలీస్ జీప్ సీతమ్మధార బంగళాముందు ఆగింది. జీప్ నుంచి పోలీస్ డాక్టర్, వేలిముద్రల నిపుణుడు, ఫోటోగ్రాఫర్, నలుగురు పోలీసులు దిగేరు, యిన్‌స్పెక్టర్ సుధాకర్‌తో సహా.

అందరూ పోర్టికోదాటి లోనికొచ్చేసరికి దాదాపు ఏభైయ్యేళ్ళ ముసలిమనిషి వారికి ఎదురొచ్చేడు. అతడి వేషధారణబట్టి అతడు నౌకరని యిట్టే పోల్చేయవచ్చు. అతని కళ్ళల్లో ఆందోళన, బాధ, భయం ద్యోతకమౌతున్నాయ్.

"శవం ఎక్కడ?" రొటీన్ డ్యూటీ మొదలుపెట్టేడు సుధాకర్.

"పైన, రెండోగదిలో...రండి చూపిస్తాను" అంటూ పైకి దారితీసేడు నౌకరు.

సుధాకర్‌తో పాటు అందరూ అతన్ని అనుసరించేరు.

పైన...గది అంతా అధునాతనంగా వుంది. ఖరీదైన ఫర్నీచర్, గోడలమీద శృంగారానికి సంబంధించిన అందమైన ఫోటోలు, కళ ఉట్టిపడుతున్నట్టుండే నగ్నశిల్పాలు అంతా శోభాయమానంగా వుంది. బెడ్‌లైట్ వెలుగుతూ వుంది.

ఆ గది మధ్యలో పెద్ద మంచం వుంది. దానిమీద వెల్లకిలా, మంచానికి అడ్డంగా పడున్నాడు రాజశేఖరం. కాళ్ళు సగానికి పైగా నేలమీదికి వేళ్ళాడుతున్నాయి. గుండె ప్రాంతంలో రక్తపుగాయం కనిపిస్తోంది. దాన్నిబట్టి పిస్తోలువలన మరణం సంభవించిందని తెలుస్తోంది.

పరిసరప్రాంతంలో హత్యాయుధమేదీ కనిపించలేదు. హాతుడు కాలు తగిలి టేబిల్ మీదున్న టీపాయ్ నేలబడి పగిలినట్టుంది.

శవం ముందు నిలబడి పరీక్షగా చూసేడు. హాతుడి కళ్ళల్లో ఆశ్చర్యం స్పష్టంగా కనిపిస్తోంది. దాన్నిబట్టి అతనేదో విపరీతాన్ని చూసినట్టనిపిస్తోంది. ఆ విపరీతమేదో హంతకుడిలోనే వుండి వుంటుంది.

హంతకుడికి సంబంధించిన ఆధారాలేమైనా దొరుకుతాయేమోనని గదంతా ఒకటికినాలుగుసార్లు వెదికించేడు—తనూ వెదికేడు. అతని ప్రయత్నం ఫలించలేదు.

"రాత్రి పన్నెండు గంటలు దాటేక మరణం సంభవించింది..." డాక్టర్ తన పరీక్ష పూర్తి చేసుకొచ్చి చెప్పేడు సుధాకర్‌తో.

ఆ పైన—ఫోటోగ్రాఫర్‌కి సైగ చేసేడు. పోలీస్ డాక్టర్, వేలిముద్రల నిపుణుడు, ఫోటోగ్రాఫర్ ఎవరి

డ్యూటీలో వారు పదేక ఆలోచిస్తూ బయటికి నడిచేడు సుధాకర్.

బయట — యింతకుముందు ఆ గదిలోనికి తీసుకొచ్చిన నౌఖరు నిలబడి వున్నాడు.

"ఫోన్ చేసింది నువ్వేనా?" అన్నాడు అతనుద్దేశించి.

అవునన్నట్టు తలూపాడు.

"నీ పేరు?"

"రంగయ్యంటారు,"

"ఎంతకాలంనుండీ పన్చేస్తున్నా విక్కడ?"

"ఈ బంగళా పని చేస్తున్నాను బాబూ."

"రాజశేఖరంగారు ఎలాంటి మనిషి?"

"ఆయన దేవుడు బాబూ. మనుషుల్లో తప్పపుట్టిన మారాజు. ఎనకటి జన్మలో ఏం పాపం చేసుకున్నారో ఏమో – హైదరాబాదులో నిక్షేపంలా గుండేవారు. యిక్కడికొచ్చి యిలా అయిపోయేరు."

"సరే నీకేం తెలుసో చెప్పు..."

"హైదరాబాదులో కాకుండా బాబుగారికి యిక్కడ కూడా వ్యాపారం వుంది. సంవత్సరానికోసారి వచ్చి చూసి పోతుంటారు బాబుగారు. అయ్యగారు వచ్చినప్పుడు తప్ప మరి నాకు పనుండదు. మిగతా రోజుల్లో ఈ బంగళా ఖాళీగా వుంటుంది..."

"అది సరే... రాత్రి వేళ నువ్వెక్కడుంటావ్?"

"బంగళాకి ఎడం ప్రక్కన చిన్న పాక వుంది... అందులో వుంటాను."

"నిన్న రాత్రి ఎన్ని గంటలకి పడుకున్నావ్?"

"పదకొండు దాటింది బాబూ. ఆ వేళవరకు బయట కూకుంటాను. తర్వాత తలుపులన్నీ సరిగా వున్నాయో లేదో చూసుకుని వచ్చి పడుకుంటాను..."

"అయితే నిన్న రాత్రి పిస్తోలు పేలిన శబ్దంగాని, యింట్లో యెవరైనా ప్రవేశించిన అలికిడిగాని వినిపించ లేదా?"

"లేదండి. నాది మొద్దు నిద్ర" అన్నాడు బుర్ర గోక్కుంటూ.

"రాజశేఖరంగారితో యింకెవరూ రాలేదా?"

"ఎందుకు రాలేదండి... మొదట శవాన్ని చూసింది అమ్మగారేనండి."

"ఎక్కడుందామె?"

"రండి" అంటూ ప్రక్క గదిలోకి దారితీసేడు. వెంట సుధాకర్ వెళ్ళేడు.

అప్పుడే పార్వతి శాస్త్ర తేరుకుని లేచికూర్చుంది. పార్వతి మంచం ప్రక్కనే ఒకామె నిల్చొనుంది. ఆమె పార్వతిని ఓదారుస్తోంది. ఆమె పని మనిషి.

ఇన్‌స్పెక్టర్ సుధాకర్ లోనికివచ్చేక ఒక ప్రక్కకి ఒదిగి నిల్చుందామె.

పార్వతివేపు చూసేడు సుధాకర్.

ఎర్రబారిన కళ్ళు అంతవరకు ఆమె ఏడ్చిందన్న సంగతి గుర్తు చేస్తున్నాయి.

"బాధపడి ప్రయోజనం లేదు...మనం చేయగలిగిం దల్లా హంతకుణ్ణి ఉరికంబం ఎక్కించడమే."

పార్వతి రెండు చేతులతో మొహం కప్పుకుని వెక్కి వెక్కి ఏడ్వసాగింది.

"చూడండి పార్వతిగారూ! మీరు రాజశేఖరం గారితో కలిసి విశాఖపట్నం వచ్చేరుకదా...ఎందు కొచ్చిందీ మీ భర్త చెప్పారా?"

"లేదు. కాని బయల్దేరిన దగ్గర్నుంచి ఆయన ఏదోలా వున్నారు. కారణం తెలుసుకోలేకపోయేను." పైట చెంగుతో కళ్ళు తుడుచుకుంటూ అంది.

"ఆయన్ని చంపేంత కక్ష ఎవరికైనా వుందా?"

"వ్యాపారమన్నాక అనేక లావాదేవీలు. వాటి వెనుకవున్న కక్ష గురించి నాకు తెలియదు."

"ఈ మధ్య మీ భర్తలో మార్పు ఏమైనా కని పెట్టారా?"

"దేనికో భయపడుతున్నట్లుగా కనిపించేరు."

"అతను చనిపోయినట్లు మీ కెలా తెలిసింది?"

"బారెడు ప్రొద్దెక్కినంతదాకా నిద్రపోయే అల వాటు లేదాయనకి. ఎనిమిది గంటలు కావస్తున్నా లేవక పోవడంతో వెళ్ళి చూసేను..."

తర్వాత జరిగిందేమిటో నౌకరు చెప్పిందాన్ని బట్టి అర్థం చేసుకున్నాడు సుధాకర్.

మరో రెండు మూడు ప్రశ్నలు వేసేడుగాని అంత కంటే ఎక్కువ సమాచారం లభించలేదు సుధాకర్‌కి.

సుధాకర్ ఒక్కక్షణం ఆలోచించేడు. రాజశేఖరంకి శత్రువులెవరూ వున్నట్టు తెలియలేదు. రాత్రివేళ పిస్తోలు పేలిన శబ్దం ఎవరూ వినలేదు. బహుశా సైలెన్సర్ పిస్తో లయి వుంటుంది. హత్యాయుధం దొరకలేదు. హత్యకి కారణం అంతుబట్టడంలేదు.

యింతలో అంబులెన్స్ వచ్చిందంటూ టూనాట్ సిక్స్ వచ్చి చెప్పేడు.

"శవాన్ని మార్చ్యురీకి పంపించు" అని అతన్ని ఆదేశించేడు.

"సార్! బయట చూసేం. పిస్తోలు దొరకలేదు కానీ, సిమెంట్ పైపుమీద ఎవరిలో అడుగులు కనిపించేయి. మన ఫోటోగ్రాఫర్ అవన్నీ తీస్తున్నారు" అని వినయంగా తెలియజేసేడు.

అది విని తల పంకించి హంతకుడు బయటనుండి వచ్చినట్లు నిర్ధారణ చేసుకున్నాడు సుధాకర్. సుధాకర్ లేచి నిలబడ్డాడు. "ఆల్ రైట్! మీరు మాత్రం కాస్త జాగ్రత్తగా వుండండి" అని బయటికి నడిచేడు.

మరికొన్ని నిముషాలకి పోలీసు బలగమంతా యిల్లు విడిచి వెళ్ళిపోయింది.

రంగయ్య చిన్నగా నిట్టూర్చి, పార్వతి మంచం ప్రక్కనే కూలబడ్డాడు.

4

క్రితం రోజు రాత్రే బొంబాయినుండి వచ్చేడు డిటెక్టివ్ సురేంద్ర.

ప్రొద్దుటే కాఫీతాగి, పేపరు తిరగేస్తున్నాడు. ఏదో వార్తను చదువుతూ ఉన్నట్టుండి గతుక్కుమన్నాడు. హడావుడిగా లేచి టెలిఫోన్ వద్దకు వెళ్ళేడు. తీవ్రంగా ఆలోచిస్తూ ఒక నిమషంపాటు టెలిఫోన్ వద్ద నిలబడిపోయేడు.

సిగరెట్ పీలుస్తూ, రిసీవరెత్తి ఏదో నంబరు డయల్ చేశాడు.

"టూ టౌన్ పోలీస్ స్టేషన్" అంది అవతలి కంఠం.

"డిటెక్టివ్ సురేంద్రను మాట్లాడుతున్నాను. ఇన్స్పెక్టర్ సుధాకర్ వున్నాడా?"

"నమస్తే సర్! లోపల గదిలో వున్నారు. లైన్లో వుండండి, పిలుస్తాను."

కాసేపట్లో యిన్స్పెక్టర్ సుధాకర్ గొంతు వినిపించింది.

"హలో సురేంద్రా! ఏమిటింత అకస్మాత్తుగా నేను గుర్తుకొచ్చేను? నీలాంటి బిజీమనిషి గొంతు కనీసం టెలిఫోన్లో అయినా వింటున్నందుకు సంతోషంగా వుంది. బొంబే వెళ్ళావని విన్నాను. బొంబేలో ఏదన్నా కేసు తగిలిందా, ఏమిటి?"

"లేదు మహానుభావా! యిక్కడ కేసుల బాధపడలేక దూరంగా పారిపోవాలనిపించింది...అదిసరే గాని, నీనుండి నాకో సహాయం కావాలి సుధాకర్!"

"ఎప్పుడూ లేనిది కొత్తగా అడుగుతున్నావేంటి? ఏం కావాలి నీకు?"

"పేపర్లో కల్పనా ప్రొడక్ట్స్ కంపెనీ యజమాని రాజశేఖరం హత్య విషయం చదివేను..."

యింకేదో చెప్పబోతుండగా "ఈ కేసులో నీ యింట్రెస్టేమిటి? నీ క్లయింటెవరు?" కేసు సురేంద్ర చేతిలో పడుతున్నందుకు, తత్ఫలితంగా తనకు పరోక్షంగా సురేంద్ర సహాయకారి కాబోతున్నందుకు సుధాకర్ లోలోన సంతోషించేడు.

"హంతుడే నా క్లయింటు. రాజశేఖరం నా క్లాస్మేట్. విశాఖపట్నం వచ్చినప్పుడల్లా నన్ను కలుస్తుంటాడు. అతని హత్య గురించి యిప్పుడే చదివేను. ఎలాగైనా హంతకుణ్ణి పట్టుకోవాలని నిర్ణయించుకున్నాను."

"వెరీగుడ్, నువ్వీ కేసులో సహాయపడుతున్నందుకు

నాకు కూడా సంతోషంగా వుంది. హంతకుడు తేలిగ్గా పట్టుపడ్డాడు కూడా."

"అది సరే. నీ పరిశోధన ఎంతవరకు వచ్చింది? వివరాలు చెప్పు?"

రంగయ్యా ఫోన్ చేసిం దగ్గర్నుంచీ తన పరిశోధన వివరించేడు ఇన్‌స్పెక్టర్ సుధాకర్. "ఆ రోజు ఉదయం కొద్దిగా వర్షంపడడంవలన తోటలో నేల కాస్త తడిగా వుంది. ఆ తడిలో ఏవో పాదముద్రలు కనిపించేయి. సిమెంట్ పైపుమీద ఆవే అడుగులున్నాయి. అడుగు జాడలనుబట్టి హత్య చేసినది మగాడేనని నిర్ణయించుకున్నాను. అంతేగాకుండా తలుపులుమీద కూడా వేలిముద్రలు లభించేయి. హంతకుడి చేతికి నాలుగువేళ్ళే!"

"ఈజిట్!"

"నిజమే. కాని నాలుగు వ్రేళ్ళున్న వాళ్లు ఎందరో వున్నారు. ఎందర్నని పరిశోధిస్తాం?"

"వ్రేలిముద్రలు ఆ యింట్లో ఎవరివీ కావా?"

"కాదు. ఆ యింట్లో హతుడి భార్య, నౌకరుతప్ప, వేరెవరూ లేరు."

"హత్యచేసిన మనిషి తన వేలిముద్రల్ని అంత తేలిగ్గా విడుస్తాడా? హత్యచేసిన వెంటనే వాటి పని చూసుకునే వెళ్తాడు. ఏమంటావ్?"

"నువు చెప్పింది నిజమే. ఒకటి జరిగుంటుంది. హత్య చేసిన తర్వాత అతనికి క్రిందనుంచి ఏదో అలికిడి తగిలుంటుంది. అందుకని వెంటనే పారిపోయుంటాడతను. యీ రకంగా వేలిముద్రలు తుడిచివేసే అవకాశం అతనికి లేకపోవచ్చు."

"గుడ్ వెరీగుడ్ పాయింట్." అతన్ని మెచ్చు కున్నాడు సురేంద్ర సాయంత్రం తను కలుస్తానని చెప్పి ఫోన్ పెట్టేశాడు.

5

కల్పనా ప్రొడక్టివ్ కంపెనీముందు ఆగింది జావా మోటారు సైకిల్. దానిమీద నుంచి దిగేడు డిటెక్టివ్ సురేంద్ర. మోటారుసైకిల్ని ప్రక్కకుతీసి స్టాండువేసి ఆఫీసు వేపు చూసేడు.

కల్పనా ప్రొడక్టివ్ కంపెనీకి యజమాని రాజశేఖరం. కాని అతను మెయిన్ సంస్థను చూసేందుకు తన మకాంని హైదరాబాదులో ఏర్పాటు చేసుకుంటూ, విశాఖపట్నం లోని బ్రాంచి వ్యవహారాలు చూసేందుకు పరాంకుశాన్ని నియమించేడు. పరాంకుశం అతని ప్రాణస్నేహితుడు.

లోనికి నడిచేడు సురేంద్ర.

పరాంకుశం రివాల్వింగ్ ఛెయిర్లో కూర్చొనున్నాడు. లోపలకు వచ్చిన మనిషి ఎవరా అన్నట్లు చూసేడు సురేంద్ర వేపు.

"అయామ్ డిటెక్టివ్ సురేంద్ర" అంటూ తనను తను పరిచయం చేసుకున్నాడు.

"గ్లాడ్ టు మీట్ యూ" అంటూ పరాంకుశం రివాల్వింగ్ ఛెయిర్లోంచి లేచి నిలబడి చేయి అందించేడు. "కూర్చోండి" అన్నాడు వెంటనే. అతను కుర్చీలో కూర్చున్నాడు.

"వాట్ కెన్ ఐ డూ ఫర్ యూ?" సభ్యత అతని గొంతులో ఉట్టిపడుతోంది.

"రాజశేఖరం హత్యకేసు విషయంలో పరిశోధిస్తూ మీ దగ్గరికి వచ్చేను" అన్నాడు నాందిగా.

"అడగండి."

"శేఖరం విశాఖపట్నం వస్తున్నట్లు మీకు తెలుసా?"

"లేదు. శేఖరం ఎప్పుడొచ్చినా టెలిగ్రాం యిచ్చేవాడు. కాని యీసారి అలా జరగలేదు."

"వ్యాపారం పూర్తిగా అతనిదేనా? లేక అతను కేవలం భాగస్వామియేనా?"

"లేదు. యిది హైదరాబాదు కంపెనీకి బ్రాంచి మాత్రమే. రెండు కంపెనీ లబాధ్యతను తను చూసుకునే వీలులేక నన్ను నియమించేడు. వ్యాపారం పూర్తిగా అతనిదే. అసలు శేఖరం సంవత్సరానికోసారి వస్తుంటాడు. కాని ఈసారి...?"

"ఈసారి?" రెట్టించాడు సురేంద్ర.

"నెల తిరక్కుముందే మళ్ళీ వచ్చాడు."

"ఎందుకొచ్చిందీ చెప్పాడా?"

"ఆ! అర్జంటుగా డబ్బుకావాలట."

"ఎంత?"

"రెండు లక్షలు!"

"ఎందుకో అడిగారా?"

"అడిగేను. కాని అతను చెప్పడానికి యిష్టపడలేదు. వ్యాపారంనుంచి అంతడబ్బు ఒక్కసారి తీసేస్తే మంచిది కాదని చెప్పేను. అతను వినలేదు. ఎలాగయినా సర్దుబాటు చేయమన్నాడు. నువ్వేదయినా బ్లాక్ మెయిలింగ్ కేసులో చిక్కుకున్నావా అని అడిగేను. అతను నన్ను కసురుకున్నాడు. రెండులక్షలు యిచ్చివేస్తే వ్యాపారం మూసివేయవలసి వుంటుందని ఆఖరి అస్త్రాన్ని ప్రయోగించాను. అయినా భయం లేదన్నాడు."

"అయితే ఏం చేసేరు? రెండు లక్షలు ఇచ్చేరా?"

"మరుసటిరోజు మధ్యాహ్నం వస్తే, అప్పటికి సర్దుబాటు చేయగలనని చెప్పాను."

"వచ్చాడా?"

"ఆ! వచ్చాడు. బ్రీఫ్ కేస్ తీసుకొని వెళ్ళిపోయాడు"

"అలా వెళ్ళేక మళ్ళీ కన్పించాడా?"

"ఆరోజేగా హత్య చేయబడింది."

"ఈ హత్య యెందుకు జరిగిందంటారు?"

"నేనెలా చెప్పగలను?"

"ఊహించి చెప్పవచ్చుగా. అతను తీసుకెళ్ళిన డబ్బు కోసం హత్య జరిగిందేమో?" కదిలించి చూసేడు.

"మే బి ఆర్ మే నాట్. కాని అతనేదో బ్లాక్ మెయిలింగ్ కేసులో చిక్కుకున్నాడని నా అనుమానం"

"అలా అని ఎందుకనుకుంటున్నారు?"

"శేఖరంలాంటి మంచి మనిషిని హత్య చేసేంత శత్రువులెవరుంటారు?"

"శేఖరం మంచివాడే అయినప్పుడు బ్లాక్ మెయిలింగ్ కేసులో యిరుక్కునేంత చెడ్డపని మాత్రం అతనెందుకు చేస్తాడు?" ఎదురుప్రశ్న వేసాడు. దాంతో పరాంకుశం తికమక పడినట్టున్నాడు.

"అదేమో! నేను చెప్పలేను."

"హత్య జరిగే సమయంలో మీరెక్కడున్నారు?" అతని కళ్ళలోకి చూసేడు.

"అంటే... మీరు నన్ను అనుమానిస్తున్నారా?"

"కనిపించిన ప్రతి ఒక్కరిని అనుమానించడం మా వృత్తిలక్షణం. చెప్పండి."

"ఈ వూళ్ళో నేలేను. రాజమండ్రి వెళ్ళాను."

"ఎందుకెళ్ళేరు?"

"కంపెనీ తాలూకు సరుకు అమ్మకం నిమిత్తం ఇంకో పార్టీతో ఒప్పందంవుంది. అది పూర్తిచేసుకుని రావాలని వెళ్ళాను. వచ్చాక తెలిసింది ఈ ఘోరం."

"ఆల్ రైట్! అవసరమైతే మళ్ళీ కలుస్తాను" అని చెప్పి బయటపడ్డాడు.

6

ఫోన్ మ్రోగింది.

"యస్! డిటెక్టివ్ సురేంద్ర స్పీకింగ్" అన్నాడు సురేంద్ర రిసీవరెత్తి.

"ఏం మహానుభావా! యిప్పటికి నాలుగుసార్లు ఫోన్ చేసాను. తమరిగొంతు వినేభాగ్యం కలుగలేదు."

ఫోన్‌లో బిగ్గరగా వినిపించింది ఇన్‌స్పెక్టర్ సుధాకర్ గొంతు.

"ఓ! సుధాకరా! ఏమిటి విషయం?"

"పాత నేరస్తుల జాబితాలో హత్యాస్థలంలో దొరికిన వేలి ముద్రల్ని పోల్చిచూసేను. అవి రౌడీ మస్తాన్ వేలి ముద్రలతో సరిపోయాయి. అతని కుడిచేతికి బొటనవేలు లేదు. అతన్ని అరెస్టుచేసి లోపల పడేసాను."

"హత్య చేసినట్లు అంగీకరించాడా?"

"అదే జరిగితే నాలుగుసార్లు నీకు ఫోన్ చెయ్యాల్సిన ఖర్మ నాకేమిటి? తనుహత్య చేయలేదనే అంటున్నాడు."

"నాలుగు తగల్నియ్ లేకపోయేవ్? నిజం దానంతట అదే పరిగెత్తుకు వస్తుంది."

"ఆపనీ చేసేను. కాని ప్రయోజనం లేదు. ఏం చేయాలో అర్థం గావడం లేదు. నువ్వు వస్తే ప్రయోజనముంటుందని అనుకుంటున్నాను."

"ఆల్ రైట్! పదినిముషాల్లో అక్కడుంటాను" అని చెప్పి ఫోన్ పెట్టేశాడు.

సరిగ్గా పదినిముషాలకి జావా మోటర్ సైకిల్ స్టేషన్ ముందు ఆగింది.

గేటు దగ్గరున్న జవాను లేచి సెల్యూట్ చేసాడు. అతని సెల్యూట్ ని అందుకొని, హుందాగా నడచుకుంటు లోన అడుగుపెట్టేడు.

సుధాకర్ ఏవో ఫైల్స్ లో మునిగిపోయున్నాడు. అడుగుల శబ్దానికి తలెత్తి, సురేంద్రను చూసి ఆదరంగా రిసీవ్ చేసుకున్నాడు. కేసును గురించి మరోసారి ఆలోచిస్తున్నాననీ. రౌడీ మస్తాన్ హత్య యెందుకు చేశాడో అర్థంగావడం లేదనీ సుధాకర్ వ్యక్తం చేసాడు.

"అది తర్వాత ఆలోచిద్దాం...మస్తాన్ని చూసివద్దాం పద" అన్నాడు సురేంద్ర వెంటనే.

అలాగే అంటూ సెల్ వేపు దారితీశాడు సుధాకర్. సురేంద్ర అతన్ని అనుసరించాడు. కానిస్టేబుల్ సెల్ తలుపులు తెరచి వెనక్కి వెళ్ళిపోయాడు. సురేంద్ర, సుధాకర్ లోనికినడిచారు. లోపల ఓమనిషి వున్నాడు.

అతను రౌడీ మస్తాన్! అతనివేపు చూసాడు డిటెక్టివ్ సురేంద్ర.

రౌడీ మస్తాన్ సుమారు ఆరడుగుల ఎత్తుగలిగి, విశాలమైన వక్షస్థలంతో గంభీరంగా వున్నాడు. ముఖంమీద స్ఫోటకం మచ్చలు చంద్రునిలోని మచ్చలవలెవున్నాయి.

ఎడమ చెంపమీద రెండు కత్తిగాట్లు వున్నాయి. వంకీలు తిరిగిన తలవెంట్రుకలు గంపలా రేగివున్నాయి. మెలి తిరిగిన మీసాలు, నలుపురంగు బనీను, గళ్ళలుంగీ కట్టు కున్నాడు. మెడలో బంగారం చైను.

"రౌడీ మస్తాన్ నువ్వేనా?" అతనివేపు చూసాడు సురేంద్ర తాపీగా.

"నేనెవరో తెలియకుండానే నన్ను తీసుకువచ్చారా?" ఎదురుప్రశ్న వేసాడు.

"అడిగిన ప్రశ్నకు సరిగా సమాధానం చెప్పరా ఇడి యట్" అంటూ పిడికిలి బిగించి మస్తాన్ మీదకు విసర బోయేడు ఇన్‌స్పెక్టర్ సుధాకర్.

చప్పున అతన్ని వారించేడు సురేంద్ర. వెంటనే సుధా కర్‌ని వెళ్ళిపొమ్మన్నట్లు కనుసైగ చేసాడు. అర్థం చేసు కుని అక్కడ్నించి వెళ్ళిపోయాడు సుధాకర్. తలుపు దగ్గరున్న పోలీసు అతని వెంటనే వెళ్ళిపోయాడు.

"మిస్టర్ మస్తాన్! మర్యాదగా అడిగిన ప్రశ్నలకు సక్రమంగా సమాధానం యిస్తావని ఆశిస్తున్నాను. లేక పోతే నిన్ని వుచ్చునుంచి భగవంతుడుకూడా రక్షించ లేనంతగా యిరుక్కుపోతావ్. ఏమంటావ్?" స్థిర గంభీర స్వరంతో అన్నాడు డిటెక్టివ్ సురేంద్ర.

రౌడీ మస్తాన్ పేరువింటే విశాఖపట్నం అంతా గజ గజలాడుతుంది. అతనిపేరు చెబితే ఊర్లో గూండాలు, రౌడీలూ మంచినీళ్ళు ముట్టరు. నరాల్లోని రక్తం గడ్డ కట్టుకుపోతుంది. అతని తీరుతెన్నులు చూస్తూంటే అసలు అతనికి భయమనేది తెలియనట్టుంది. పోలీసులు, పోలీసాక్షీ సర్లంటే అతనికి లక్ష్యమున్నట్టు లేదు.

ఏమనుకున్నాడో, ఏమో సమాధానాలు ఇవ్వడానికి అంగీకరించాడు.

"అడగండి" అన్నాడు నెమ్మదిగా.

"కల్పనా ప్రొడక్టివ్ కంపెనీ యజమాని రాజశేఖరం నీకు తెలుసా?" అడిగేడు అతన్ని తేరిపార చూస్తూ.

"తెలీదు" అన్నాడు గతుక్కుమంటూనే.

"పోనీ, సీతమ్మధార దగ్గరున్న బంగళా తెలుసా?"

"తెలుసు."

"ఎలా?"

"నేను రోజూ అటువేపునుండే వెళుతుంటాను."

"ఆ బంగళాలోకి ఎప్పుడయినా వెళ్ళావా?"

"లేదు."

"బాగా ఆలోచించుకుని చెప్పు. దొంగతనం చేయడానికిగాని వెళ్ళావా?"

"లేదు, వెళ్ళలేదు."

"వెళ్ళకపోతే ఎలా హత్య చేయగలిగావ్?"

"హత్యా? అబద్ధం...నాకేం తెలీదు," అరిచేడు.

"బుకాయించి ప్రయోజనంలేదు మస్తాన్! నిన్ను పట్టిచ్చే ఆధారాలన్నీ దొరికాయి. తలుపులమీద నీ వేలిముద్రలు, సిమెంటు పైపుమీద, బంగళాతోటలో నేలమీద నీ అడుగుజాడలు నిన్ను దోషిగా పట్టివ్వక తప్పదు. కనుక నువ్వు నీ నేరాన్ని అంగీకరించడం మంచిది..."

"నాకేం తెలీదు." మొండిగా సమాధానం ఇచ్చేడు.

"మస్తాన్! అబద్ధాలాడి ప్రయోజనంలేదని ముందే చెప్పాను. నీచేత నిజం యెలా చెప్పించాలో నాకు బాగా తెలుసు..."

అని అంటుండగానే మస్తాన్ తెరచివున్న తలుపుకేసి పరిగెత్తాడు.

అంతే! సురేంద్ర నోట్లోంచి విచిత్రమైన అరుపు ధ్వనించింది.

అది ఫ్లయింగ్ కిక్!

సురేంద్ర, మస్తాన్ మీదికి గాలిలోంచి ఎగిరిదూకేడు. అతనికాళ్ళు మస్తాన్ గుండెల్ని హత్తుకున్నాయి. అంతే, మస్తాన్ చెట్టులా విరుచుకు పడిపోయాడు. పొలికేక లాంటిది అతని నోట్లోంచి వెలువడింది.

ఫ్లెయింగ్ కిక్ సాధారణమైనది కాదు. దాని తాకిడికి వజ్రకాయుడయినా, ఇనుప తలుపులయినా విరిగి పడవలసిందే! ఆ కిక్‌లో అంతశక్తి వుంది. ఇది కరాటే విద్యలో ఒకభాగం.

ఇన్‌స్పెక్టర్ సుధాకర్, నలుగురు పోలీసులు పరిగెత్తుకుంటూ వచ్చారు.

తలుపుల దగ్గర పడివున్న మస్తాన్‌ని చూసి జరిగిందేమిటో గ్రహించాడు సుధాకర్.

"అరగంటవరకు మస్తాన్ లేవడు. పద" అని కానిస్టేబుల్ వేపు చూసి "తెలివిరాగానే చెప్పండి... జాగ్రత్త" అని బయటకి నడిచాడు. అతని వెనకాలే వచ్చాడు సుధాకర్.

క్షణంముందు మొండిగా సమాధానాలిచ్చే యేనుగు లాంటి మస్తాన్ విరుచుకు పడిపోవడాన్ని చూసి బెంబేలెత్తిపోయారు పోలీసులు. ఇప్పుడు సురేంద్రవేపు చూడ్డానికే భయంగావుంది వాళ్ళకి.

సురేంద్ర ఉస్సురుమంటూ కుర్చీలో కూలబడ్డాడు.

సుధాకర్ తన సీట్లోకి చేరుకున్నాడు.

కానిస్టేబుల్‌ని పిలిచి కాఫీ పట్రమ్మని చెప్పాడు. అయిదు నిముషాల్లో పొగలు గ్రక్కే కాఫీలు వారిముందు ప్రత్యక్షమయ్యాయి.

“నిజం ఒప్పుకుంటాడంటావా?” కాఫీసిప్ చేస్తూ అడిగాడు సుధాకర్.

“ఏమో మెలకువ వచ్చాక గానీ తెలియదు.”

మళ్ళీ సురేంద్రే అన్నాడు.

“హత్యాస్థలంలో లభించిన వేలిముద్రలు, పాదముద్రలు ఓసారి చూపించు” అని, కాఫీకప్పు క్రింద పెట్టేసి సిగరెట్ వెలిగించుకున్నాడు. గట్టిగా పొగపీల్చి వదిలేడు. అతనిలో ఆలోచనలు రగులుకుంటున్నాయి.

“మస్తాన్ తాలూకు వేలిముద్రలు ఏవీ?”

అవికూడా తీసిచ్చేడు సుధాకర్. రెంటినీ అయిదు నిమిషాలు పరీక్షగా చూసేడు. తల పంకించాడు.

“రాజశేఖరాన్ని చంపినందువలన మస్తాన్‌కి కలిగే ప్రయోజనం ఏమిటి?” సుధాకర్ ఇందాకట్నుంచి ఆలోచిస్తున్న ప్రశ్నయిది! అదే అడిగాడు సురేంద్రని.

“సింపుల్. ఇది మస్తాన్ మెదడులో పుట్టిన బుద్ధి కాదు. మస్తాన్ డబ్బిస్తే యెంతపని చేయడానికయినా సిద్ధం. మస్తాన్, రాజశేఖరాన్ని హత్య చేసేందుకు నియమించబడ్డ కిరాయి హంతకుడు.”

అదిరి పడ్డాడు సుధాకర్.

“కిరాయి హంతకుడా?” ఆశ్చర్యంగా నోరెళ్ళబెట్టాడు.

"అవును. ఇప్పుడు, అతన్ని ఎవరు నియమించారో మనం తెలుసుకోవాలి."

ఇంతలో ఓ పోలీసు వచ్చేడు.

"సార్! అతను కళ్ళు తెరిచాడు" అని చెప్పాడు వినయంగా.

7

ఆఖరి దమ్ములాగి సిగరెట్ ఏష్‌ట్రేలో పడేసి మస్తాన్ దగ్గరకి నడిచాడు. సురేంద్రని చూడగానే మస్తాన్ మొహంలో భయం తాండవించింది. ఇప్పుడతని మొహంలో మునుపటి గాంభీర్యం, మొండితనం గోచరించడం లేదు. మొహం నీరసంతో తోటకూరకాడలా వేలాడుతుంది. అది ఫ్లైయింగ్ కిక్ ప్రభావమని తెలుస్తోంది.

"ఇప్పటికయినా నిజం చెబుతావా?"

"లేదు, నేనీ హత్యచేయలేదు" భయం అతని నరనరాల్లోను వ్యాపించినట్టు అతనిగొంతు చిన్నబోయింది.

"ఇందాక చూపించింది సేంపిల్. నువ్వు హత్యచేసిన సంగతి నాకు తెలుసు. కాని ఆ హత్య వెనకవున్న నిజం నాక్కావాలి. నిన్ను నేరస్థుడిగా నిరూపించే ఆధారాలన్నీ నాదగ్గరున్నాయి. నిజం నీచేత చెప్పించాలనే నా ప్రయత్నం. సిమెంట్ పైపుమీదున్న నీ పాదముద్రలు, తలుపులమీద దొరికిన నీ వేలిముద్రల ఆధారంతో నిన్ను హంతకుడిగా నిరూపించి ఉరికంబం యెక్కించడం విచిత్రంకాదు. నిజం నీచేత చెప్పించాలనే నాప్రయాస."

"నేను నిజమే చెబుతున్నాను. నమ్మరేం?" అమాయకుడిలా మొహం పెట్టాడు.

"యూ బాస్టర్డ్!" అంటూ పిడికిలి బిగించి అతని మొహంలోకి విసరబోయేంతలో మస్తాన్ కెవ్వుమని అరిచాడు. ఎండుటాకులా వణికిపోసాగాడు.

"వద్దు...నిజం చెప్పేస్తాను" గజగజ వణికిపోతున్నాడు.

"అలారా దారికి...ఇప్పుడు చెప్పు, రాజశేఖరాన్ని యెందుకు హత్యచేసావ్?"

మస్తాన్ చెప్పడం ప్రారంభించాడు.

"ఆరోజు నా గుడిసెముందు కుక్కి మంచంలో కూలబడ్డాను.

అప్పుడు సరిగ్గా ఆరుగంటలవుతుంది. ఇంకా చీకటి పడలేదు. ఇంతలో నన్ను వెతుక్కుంటూ ఓ మనిషి వచ్చేడు.

"మస్తాన్ ఎవరు?" అని అడిగేడు నన్ను చూసి.

"నేనే మస్తాన్ని! ఏం కావాలి?" అని అడిగేను అతనివేపు చూసి.

"టాప్ సీక్రెట్ గా నువ్వో పని చేయాలి. అందుకు నువ్వు కోరినంత డబ్బిస్తాను. అలా అని నేను యివ్వలేనంతగా డిమాండు చేయవద్దు" అని నవ్వేడతను.

"విషయమేమిటో చెప్పండి" అన్నాను చుట్ట వెలిగించుకుంటూ.

"ముందు లోపలికి పోదాం పద"

"అలాగే" అంటూ నేను గుడిసెలోనికి దారితీసేను. అతను నా వెనకాలే లోనికి వచ్చేడు. కుర్చీలో కూర్చున్నాడు.

"ఇప్పుడు చెప్పండి. ఏం చేయాలి?"

''రాజశేఖరం అనే మనిషిని హత్యచేయాలి నువ్వు!'' ఓ మారు చుట్టూచూసి అన్నాడతను.

''ఓ మర్డర్ కాంట్రాక్టా? యింతకీ అతనెవరు?''

''చార్మినార్ ప్రాంతంలోవున్న కల్పన ప్రొడక్టివ్ కంపెనీ యజమాని'' అంటూ అతను వివరాలు చెప్పేడు.

''ఈ హత్యవలన నీకు కలిగే లాభం ఏమిటి?'' అని అడిగేను.

''నీకనవసరం. నీకొక్కవలసింది ప్రతిఫలం. అడిగి తీసుకో. హత్యవలన కలిగే లాభాల గురించి అడగకు'' కటువుగా అన్నాడతను.

''ఆల్ రైట్! పాతిక వేలు యిచ్చి వెళ్ళండి'' అన్నాను. కాస్త ఎక్కువే చెప్పాను. నేనెంత అడిగినా అతను యిస్తాడని అర్థమైపోయింది నాకు.

''ఇప్పుడు కాంట్రాక్టు నాకు నచ్చని కారణంగా నేను వెళ్ళిపోతే?'' సందేహం వెలిబుచ్చేడతను.

''కన్సల్టింగ్ ఫీజు వెయ్యిరూపాయలు చెల్లించాల్సి వుంటుంది.''

''ఇవ్వకపోతే?''

''నువు హత్యచేయమని చెప్పిన వ్యక్తికి ఈ సమాచారం అందుతుంది అంతే.''

''పాతిక వేలు యివ్వడానికి అభ్యంతరం లేదు. కాని పూర్తిగా యిప్పుడే యివ్వాలా?''

''అవును. హత్యవల్ల నీకు కలిగే లాభం చెప్పలేదు. నువ్వెవరో నాకు తెలియదు. తీరా హత్య జరిగేక నువు ఒప్పుకున్న డబ్బు యిస్తావన్న నమ్మకం ఏమిటి?''

''హత్య చేయకముందే డబ్బిస్తే నువు చేస్తావన్న

గ్యారంటీ ఏమిటి? ఆ డబ్బు తీసుకుని ఉడాయిస్తే?" ఎదురుప్రశ్న వేసేడు.

"నీకు నమ్మకముంటేనే యివ్వు. లేదంటే ఈ పనికి మరొకర్ని చూసుకోండి" అన్నాను.

"ఆల్ రైట్! యిప్పుడే యిస్తాను" అని చెప్పి జేబులోంచి నూరురూపాయల నోట్లకట్టలు తీసి నా ముందుంచేడు. నేను వాటిని అందుకుని ముద్దుపెట్టుకున్నాను.

"చాలా సంతోషం! నాకు రెండురోజులు గడువిస్తే పని పూర్తిచేస్తాను."

"నో! నో! ఈ రాత్రికే పని పూర్తిచేయాలి" అంటూ రాజశేఖరాన్ని ఎలా హత్యచేయాలో ఓ ప్లాను వివరించి చెప్పాడతను. ఆ ప్లాను నాకు నచ్చింది. అతను చెప్పిన ప్రకారమే పని పూర్తిచేసేను."

"అయితే హత్యచేసేవా?" కోపంగా అడిగేడు సురేంద్ర.

తల వంచుకున్నాడు మస్తాన్.

కిరాయికోసం హత్యచేయడానికి సిద్ధపడ్డ మస్తాన్ని చూడగానే సురేంద్రకి ఒళ్ళు మండుకొచ్చింది. చెంప చెళ్ళుమనిపించేడు. మస్తాన్ చెంప ఎర్రగా కంది పోయింది.

"నీదగ్గరికొచ్చిన మనిషెవరో తెలుసా?"

"తెలీదు" చెంప తడుముకుంటూ చెప్పాడు.

"అతను కనిపిస్తే గుర్తుపట్టగలవా?"

"గుర్తుపట్టలేను. అతనేదో మారువేషంలో ఉన్నట్టున్నాడు, ఆ వేషాన్ని మార్చేసుకుని వుంటాడు."

"అతని వేషాన్ని వర్ణించు."

"సన్నగా—పొడుగ్గా వుంటాడు. పైజామా, షర్వానీ, పిల్లిగడ్డం, తురకవాళ్ళ టోపీ, గిల్టుఫ్రేమున్న కళ్ళజోడు, ఫ్రెంచ్ కట్ మీసాలు."

"అంతకంటే ఆధారాలు లేవా?"

"అతని ఎడమకాలు పొట్టిలాగుంది. కాలు నేలమీద యీడుస్తున్నట్లుగా వుంది."

సురేంద్ర మస్తిష్కంలో ఆ ఆకారం రూపు దిద్దుకుంటుంది.

"అతని పేరు అడగలేదా?"

"అడిగేను. ఏన్సర్ హుస్సేన్ చెప్పేడు."

అది మారుపేరు కావచ్చునని ఊహించేడు సురేంద్ర.

హత్యకు కారణమైన వాళ్ళు తెరచాటున వుండే ఈ పని చేయించారన్నమాట. అంటే యిది బ్లాక్ మెయిలింగ్, పగ వాటికి సంబంధించిన హత్య కాదన్నమాట. తనసెవరూ అనుమానించకుండా, గుర్తించకుండా కిరాయి హంతకుడ్ని నియమించడం, మారువేషం ధరించడం ద్వారా తన పని సానుకూలం చేసుకున్నాడు హంతకుడు. హంతకుడు ఘటికుడులాగే వున్నాడు.

హంతకుడెవరు? రాజశేఖరాన్ని తొలగించినందువలన హత్యచేయమని చెప్పిన వ్యక్తికి కలిగే లాభం ఏమిటి?

డబ్బు! ఎస్. డబ్బుకోసమే యీ హత్య జరిగుంటుంది. రాజశేఖరానికి, భార్య కాక యింకెవరూ వారసులెవరూ లేరని ఎంక్వయిరీలో తేలింది.

మరింకెవరు ఈ హత్య చేయించారు? అతని మస్తిష్కంలో ఏదో రూపం అలుముకుంటుంది.

చకచక అడుగులేసుకుంటూ బయటికి నడిచేడు.

"సుధాకర్! మస్తాన్ పట్టుబడిన విషయం రహస్యంగా వుంచు" అని చెప్పి మోటారుసైకిల్ ఎక్కి వెళ్ళిపోయేడు.

8

"మీ అమ్మగారున్నారా?" అని అడిగేడు డిటెక్టివ్ సురేంద్ర రంగయ్యని.

"కూర్చోండి బాబూ. చెప్పివస్తాను" అంటూ లోపలికి వెళ్ళేడు రంగయ్య.

సోఫాలో కూర్చున్నాడు సురేంద్ర. గదినంతటినీ ఓ సారి పరీక్షగా చూసేడు.

'నీటు'గా పేర్చినట్లుందా గది. గోడలకి సుభాష్ చంద్రబోస్, కందుకూరి వీరేశలింగం, శాస్త్రీజీ ఫోటోలు వేలాడుతున్నాయి. గదిలో మూలకి ఓ టేబిల్ వుంది. చిన్న చిన్న వస్తువులేవో దానిమీద చోటుచేసుకున్నాయి. నాలుగు కుర్చీలు ఒక వరుసమీద వున్నాయి. గదిమధ్యలో చిన్న టీపాయ్‌వుంది.

అడుగుల సవ్వడి అయింది. అటువేపు చూసేడు సురేంద్ర.

ఎదురుగా ఓ స్త్రీ! ఆమె పార్వతి!

ఆమె యింకా భర్తపోయిన దుఃఖం నుంచి తేరుకోనట్లే కనిపించింది.

తనెవరో పరిచయం చేసుకుని, వచ్చిన పని చెప్పేడు.

"మిమ్మల్ని ఈ దశలో బాధపెడుతున్నందుకు క్షమించాలి" అన్నాడు నాందిగా..

"అడగండి" అంది పార్వతి దుఃఖాన్ని దిగమింగుతూ.

"రాజశేఖరం ఎటువంటి మనిషి?" అడిగేడు మొదటి ప్రశ్నగా.

"అంటే?" అర్థంగాక ఎదురుప్రశ్న వేసింది పార్వతి.

"అతని ప్రవర్తన ఎటువంటిది? శత్రువులెవరైనా వున్నారా?"

"ఆయన గురించి చెప్పాలంటే చాలా మంచివారు. ఇతరుల పని కూడా తనమీద వేసుకుని చేసే ఉపకార స్వభావంకల మనిషి. అటువంటి మనిషికి శత్రువులున్నారంటే నమ్మలేం. కాని వుండేవుంటారు. లేకపోతే యిలా ఎందుకు జరుగుతుంది."

"హత్య జరగడానికి ముందు అతనెలా వున్నాడు."

"ఏదో ఆందోళనలో వున్నట్లు హడావుడిగా పని చేస్తున్నట్లు అనిపించింది. ఎక్కడ్నుంచో రెండు ఫోన్ కాల్స్ కూడా వచ్చేయి. ఆయన ఆందోళనకి, హడావుడికి కారణం తెలీక ఫోన్ కాల్స్ ఎక్కడ్నుంచి అని అడిగేను. కాని చెప్పలేదు..."

"అదేమిటో మీరు వూహించగలరా?"

"లేదు."

"పరాంకుశం పట్ల మీ అభిప్రాయం?"

"చాలా మంచివాడు. మా కుటుంబంలో ఓ మనిషిలా కలిసి పోతాడు."

"ఐతే రాజశేఖరానికేమన్నా వ్యసనాలున్నాయా?",

ఆ ప్రశ్నలోని అంతరార్థం గ్రహించింది పార్వతి.

"వ్యాపారం అన్నాక పదిమందితో కలిసి తాగవలసి వస్తుంది. ఆయనకది అలవాటు అవునో కాదో

గాని తాగుతారు. ఇకపోతే ఒకటిరెండుసార్లు టైపిస్టు లలితతో ఎవరికో కనిపించేరట.''

''ఆరాత్రి మీ రెక్కడ పడుకున్నారు?''

''మేడమీద ఆయన గదిపక్కనే మరోగదివుంది. ఆ గదికీ, ఈ గదికీ మధ్యద్వారంవుంది. ఆయనకి సింగిల్ గా పడుకోవడం అలవాటు. నేను ప్రక్కగదిలో పడుకున్నాను.'' ఆప్రశ్న సురేంద్ర ఎందుకు వేశాడో అర్థమయింది పార్వతికి.

''ఆల్ రైట్! అవసరమయితే మళ్ళీ కలుస్తాను'' అని చెప్పి బయటకు వచ్చేడు.

సురేంద్ర మోటర్ బైక్ స్టార్టుచేయబోతూ ఏదో గుర్తువచ్చి మళ్ళీ లోపలికి వెళ్ళేడు. పార్వతి యెవరితోనో ఫోన్ లో మాట్లాడుతోంది. సురేంద్రనిచూసి ఠక్కుమని ఫోన్ పెట్టేసింది కంగారుగా.

''మళ్ళీ వచ్చారేమిటి?'' చిరాకు పడింది.

''ఓ విషయం మిమ్మల్ని అడగడం మరిచేను''అన్నాడు ఆమె కంగారును గమనించి.

''ఏమిటి?'' అంది విసుగ్గా.

''ఆరోజు రాత్రి ఎన్నిగంటలకు నిద్రపోయేరు మీరు?''

''యించు మించుగా పదకొండవుతుంది.''

''అయితే ఆరాత్రి మీకేవిధమయిన శబ్దంగాని,అరుపు గాని వినిపించలేదా?''

''లేదు. నిద్రపట్టకపోతే ఆయన నిద్రమాత్రలు యిచ్చేరు. వేసుకుని పడుకున్నాను. మరి తెల్లవారే వరకు తెలివిరాలేదు.''

"ఆఖరి ప్రశ్న. పరాంకుశం దగ్గర్నుండి రెండులక్షల రూపాయల బ్రీఫ్ కేసుతో బయల్దేరినట్టు చెప్పాడతను. ఆ బ్రీఫ్ కేసు ఏమయిందో తెలుసా?"

"రావడం మాత్రం బ్రీఫ్ కేసుతో వచ్చారు. ఫోన్ కాల్స్ వచ్చాక, మళ్ళీ వెంటనే దాన్ని తీసుకుని వెళ్ళిపోయారు. అందులో ఎంతవుందో చెప్పలేను" అంది.

"ఆల్ రైట్! ఇక నేవెళతాను" అని చెప్పి బయటపడ్డాడు.

ఒకనిమిషం తర్వాత మోటారుసైకిల్ స్టార్టయి వెళ్ళిపోయిన శబ్దం వినిపించింది పార్వతికి.

నిట్టూర్చి వెనక్కి తిరిగింది పార్వతి.

9

డిటెక్టివ్ అసిస్టెంటు నరేంద్ర వాచీకేసి చూసుకున్నాడు. నాలుగయింది.

దాదాపు తను అక్కడకివచ్చి నాలుగ్గంటలయింది. ఆ రోడ్డు అంతా అటూయిటూ తిరుగుతూ తచ్చాడుతున్న కారణంగా కాళ్ళులాగడం మొదలుపెట్టాయి. యెండ యెక్కువగా వుండడంతో ఒళ్ళంతా చమటపట్టింది. వచ్చి ఎదురుగావున్న రెస్టారెంట్ లో కూర్చున్నాడు.

వెయిటర్ వచ్చాడు. వేడి 'టీ' తీసుకురమ్మన్నాడు. తెచ్చాక మెల్లగా సిప్ చేస్తూ ఎదురుగ'వున్న భవనం కేసి చూస్తున్నాడు. 'టీ' త్రాగినప్పటికి పదినిముషాలుపట్టింది.

హోటల్లోని జనం వస్తూపోతూ ఉన్నారు. వెయిటర్ అతనికేసి వింతగా చూడసాగాడు.

'ఒక్క 'టీ' తాగి అరగంట రెస్టారెంట్‌లో గడిపేసినట్లున్నాడే' అన్నట్లుంది వాడి చూపు.

అయినా తను లేచి పోదల్చుకోలేదు. అక్కణ్నుంచి ఎదురుగావున్న భవనం బాగా కనిపిస్తుంది. పైగా బయట మండుటెండ. తిరగాలంటే కాళ్ళునొప్పి.

డిటెక్టివ్ సురేంద్రకు ఫోన్ చేసి యింతవరకు అతను బయటకు రాలేదని చెప్పాడు. మరోగంట వెయిట్ చేయమని చెప్పాడు సురేంద్ర.

నరేంద్ర సరేనని ఫోన్ పెట్టేశాడు.

మరో అరగంట గడిచింది.

సన్నగా, పొడుగ్గావున్న ఓవ్యక్తి భవనం ముఖద్వారం వద్ద ప్రత్యక్షమయ్యాడు. అతను తిన్నగావచ్చి గారేజ్‌లో వున్న కార్లో కూర్చుని స్టార్టు చేసాడు. కారు గారేజ్ లోంచి రోడ్డుమీదకు దూకింది.

నరేంద్ర యింత సేపూ కాచుకున్నది అతని కోసమే!

కారువెళ్ళిన నిముషానికి వెనుక టాక్సీవస్తూ కనిపించింది. ఖాళీగాకూడా వుంది. ఆపేడు నరేంద్ర. టాక్సీ ఆగింది. ఎక్కి కూర్చున్నాడు.

"డ్రయివర్! ముందు వెడుతున్న కారు నీదృష్టి పథంలోనుండి దాటిపోకుండా చూడు. నీకు పదిరూపాయలు బక్షీస్" ఆశ చూపేడు.

పదిరూపాయలమాట వినగానే టాక్సీ కదిలించాడు డ్రయివర్. రివ్వున దూసుకుపోయింది టాక్సీ.

సరస్వతి జంక్షన్‌లోంచి, అల్లిపురం, చావుల మదుం దాటుకుంటూ రైల్వే క్వార్టర్స్‌వేపు దూసుకుపోతోంది ముందు పోతున్న కారు. టాక్సీదాన్ని అనుసరించసాగింది.

ఉన్నట్టుండి ఒక ఇంటిముందు ఆగింది ముందుకారు.

నిర్మానుష్యంగా వుంది. నిశ్శబ్దంగా వుంది.

ఫర్లాంగు దూరంలోనే టాక్సీ ఆపుచేయించి, మీటరు ఛార్జీమీద పదిరూపాయలు యిచ్చి టాక్సీని పంపించేసేడు నరేంద్ర.

కారులోని మనిషి దిగేడు. దిగిన తర్వాత చుట్టూ ఎవరన్నా మనుషులున్నారేమో అన్నట్టు నలువేపులకూ చూసాడు. నరేంద్ర సిగరెట్ వెలిగించుకుని, అతన్ని చూసి చూడనట్టు సందులోకి తిరిగేడు. కాని సందు తిరిగిన వెంటనే అతనిమీద దృష్టి నిలిపేడు.

ఆగంతకుడు ఆ యింటివేపు నడిచాడు.

మరుక్షణం తలుపు తాళంతీసి లోపల ప్రవేశించాడు. జరుగుతున్నదంతా సందులో నుంచి గమనిస్తున్నాడు నరేంద్ర. తలుపులు మళ్ళీ మూసుకున్నాయి.

అయిదు నిముషాలు ఆగి నరేంద్ర ముందుకడుగేసాడు. తలుపులముందు ఆగేడు.

లోపల ఎవరిదో గొంతు వినిపిస్తోంది. నరేంద్ర తొంగి చూసాడు.

"మార్నింగ్ మైడియర్ బ్యూటీ!" అది ఆగంతకుడి గొంతు.

"ఇంకా ఎవరిగురించి ఆలోచిస్తున్నావ్? నిన్ను రక్షించే వారెవరయినా వున్నారనా? నిన్ను రక్షించడం ఎవరి తరమూ కాదు. నేను చెప్పినట్లువిను. నీ భవిష్యత్ బంగారం చేసుకో. ఈ కాయితాలమీద సంతకం పెట్టు. ఆతర్వాత మనం మన్మథసామ్రాజ్యంలో మునిగితేలుదాం" అతను జేబులోంచి కాయితాలేవో తీశాడు.

"ఛీ!" ఆమె అసహ్యించుకుంది.

"సంతకం చెయ్యకపోతే నీ బ్రతుకు ఈ అంధకారంలో తెల్లవారిపోవలసిందే. పోనీ, నీకిష్టం లేకపోతే నీమానాన నిన్ను వదలిపెడతాను. నీ యిష్టం వచ్చినచోటుకి వెళ్ళిపోవచ్చు. సంతకం చేసేయ్."

"ఈ కంఠంలో ప్రాణముండగా జరగనిపని. చచ్చేందుకయినా సిద్ధమే."

"అదే నీ యిష్టమయితే నిన్ను చంపక తప్పదు డార్లింగ్!" వికటంగా నవ్వేడా ఆగంతకుడు.

"నువు చంపినాసరే సంతకం చేయను."

"...కాని నిన్ను మామూలుగా చావనివ్వను. ముందు నిన్ను చిత్తుగా అనుభవించి, ఆ తర్వాత ఒక్కొక్క కండ వలిపిస్తాను. ఒక్కొక్క ఎముక ఊడగొడతాను. ఆ బాధలకు తట్టుకోలేక నువ్వే సంతకం చేస్తావ్. అప్పటికీ సంతకం చేయకపోతే నువ్వు నీభర్తను చేరుకోవడం తథ్యం" కర్కశంగా నవ్వేడు.

"దుర్మార్గుడా! నాభర్తనేం చేసావ్?" వణికిపోతూ అడిగింది.

"పంపించేసాను...పరలోకానికి..."

"ఆఁ" నివ్వెరపోయింది.

బయట నరేంద్రకు రక్తం వుడుకుతోంది. ఒక్క డైవింగ్ చేసి హంతకుడ్ని పట్టుకోవాలనుంది. కాని బాస్ యెట్టి పరిస్థితిలోనూ ఆవేశపడవద్దని చెప్పినందువలన నరేంద్ర కోపాన్ని అణచుకున్నాడు.

"రేపు ఉదయం వరకు టైమిస్తున్నాను. బాగా ఆలోచించి నిర్ణయించుకో."

"ఇంకా నిర్ణయించుకోవాల్సిందేం లేదు. ఎలాగూ నా భర్తలు చంపేవ్. నాద్వారా నువ్వు అనుకున్నది సాధించిన తర్వాత నన్నుకూడా బ్రతకనిస్తావన్న నమ్మకం లేదు. నీయిష్టం వచ్చినట్లు చేసుకో" ఆవేశంగా అరిచింది.

"ఆవేశపడకు డార్లింగ్! నువ్వు నన్ను నమ్మాలి."

"నమ్మాలా? నిన్నా? కుక్కని అందలం యెక్కించి నట్లు ఆయన నిన్ను నమ్మి అంతా నీచేతికి అప్పగించారు. నిన్ను నమ్మినందుకు ఏం చేసావ్? దుర్మార్గుడా! డబ్బు కోసం దేవుడులాంటి మనిషిని పొట్టన బెట్టుకున్నావు కదరా!"

"అయితే నీ నిర్ణయం మారదా?"

"చస్తే మారదు. నన్నుకూడా యిప్పుడే చంపేయ్. నీ కసి తీరుతుంది."

"మంకుపట్టు పట్టకు డార్లింగ్! నేనెవరో, ఏమిటో నీకు తెలుసు. తలచుకుంటే సాధించకుండా వదల్ననీ నీకు తెలుసు. మరింకా నువ్వు మంకుపట్టు పట్టుకుని కూర్చుంటున్నా వెందుకో? వెధవ డబ్బుకోసం జీవితాన్నీ, సుఖాన్నీ కాదనుకుంటావా?"

"వెధవ డబ్బుకోసం నువ్వు ప్రాణాలే తీయగాలేనిది నేను ఆ డబ్బుకోసం ప్రాణాన్ని యిస్తే తప్పా?"

"వద్దు డార్లింగ్! పంతాలకు పోవద్దు. సంతకం చేసేయ్. నేను నిన్ను పెళ్ళిచేసుకుంటాను. హాయిగా చిలకా గోరింకల్లాగా వుందాం."

"ఛీ! దుర్మార్గుడా! నీ నోటితో నన్ను 'చెల్లీ' అని పిలిచేవాడివి గుర్తుచేసుకోరా! నీనాలిక తెగిపడిపోతుంది" ఆవేశంగా అరిచిందామె.

చెంప చెళ్ళుమంది. చెంప తడుముకుందామె. చెంప మీద వేలిముద్రలు అచ్చుతేలినయ్. క్షణంసేపు అంతా చీకటిగా కనిపించింది. కళ్ళల్లో నీళ్ళు నిండుకున్నాయి.

"ఆడదాని మీద చెయి చేసుకోవడానికి సిగ్గులేదూ?",

"ఇది కేవలం సేంపిల్. నువ్వు సంతకం చేయకపోతే ఫలితం యింతకంటే దారుణంగా వుంటుంది. రేపు ఉదయం వరకు టైమిస్తున్నాను. బాగా ఆలోచించుకుని నిర్ణయించుకో. సంతకంచేసి సుఖాన్ని వరిస్తావో, మొండి పట్టుదలతో సంతకం చేయకుండా మృత్యువునే వరిస్తావో నీ నిర్ణయంమీద ఆధారపడి వుంటుంది. జాగ్రత్త"

తలుపులు తెరుచుకున్నాయి. ఆగంతకుడు బయటకు వచ్చాడు. అంతే! నరేంద్ర చేయి విసురుగావచ్చి అతని ముఖాన్ని పచ్చడి చేసింది.

10

డిటెక్టివ్ సురేంద్ర ఇంట్లో ఎలక్ట్రిక్ దీపాలు దేదీప్యమానంగా వెలుగుతున్నాయి. ఇంటిముందు కార్లు, టాక్సీలు జీపులూ ఆగేయి. అనేకమంది పోలీస్ కానిస్టేబుల్స్ ప్రకాశవంతంగా వున్న తోటలో పచార్లు చేస్తున్నారు. లోపల కుర్చీలు నిండివున్నాయి.

సురేంద్ర చెప్పడం ప్రారంభించాడు.

"ఈ కేసులో ముఖ్యపాత్రలు రెండు. ఒకటి పరాంకుశం, రెండు కార్లా" అంటూ పార్వతివేపు చూసాడు.

పార్వతి హఠాత్తుగా కుర్చీలోంచి లేచి ద్వారంవేపు దూసుకు పోయింది బాణంలా. ఇన్‌స్పెక్టర్ సుధాకర్ ఆమె వెనకగానే లేడిలా దూసుకుపోయి, మరుక్షణంలో

ఆమెను తీసుకువచ్చి కుర్చీలో కుదేసాడు. ఆమె తలవంచుకుంది. అదే సమయంలో పక్క హాలునుండి అసలు పార్వతి బయటకు వచ్చింది.

శార్లా ఎవరో కాదు. స్వయంగా పార్వతికి చెల్లెలు. అయిదారేళ్ళ క్రితం ఎప్పుడో యిద్దరికీ సరిపడని కారణంగా విడిపోయారు. తర్వాత పార్వతి హైదరాబాదులో రాజశేఖరం కంపెనీలో టైపిస్టుగా చేరడం,ఆమెను నచ్చి పెళ్ళిచేసుకోవడం జరిగింది.

శార్లా విక్రమ్‌హోటల్లో కేబరే డాన్సర్. అనుకోకుండా ఓరోజు విక్రమ్ హోటల్లో శార్లా తటస్థపడింది పరాంకుశానికి. అతనిలో ఆలోచన తళుక్కుమంది. ఆమెలో ఆశను రగిలించాడు. అతనితో చేతులు కలిపింది

పరాంకుశానికి వున్న వ్యసనాల వలన కంపెనీ డబ్బు రెండు లక్షలదాకా హరించుకు పోయింది. పరాంకుశానికి శాస్త్రీ, చేతులూ ఆడని సమయంలో శార్లా కనిపించడం పథకం రూపొందించడం జరిగింది.

అయితే అకస్మాత్తుగా పరాంకుశం కంపెనీ డబ్బు కరిగించేసాడని తెలిసి రాజశేఖరం ఊడిపడ్డాడు. దాంతో పరాంకుశం గొంతులో ఏదో అడ్డం పడినట్లయింది. పుస్తకాలన్నీ చెక్ చేసి రెండులక్షల రూపాయలు కనిపించనట్లుగా లెక్క తేల్చేడు రాజశేఖరం.

ఎదురుచూడని యీ సంఘటనకు నీరుకారి పోయాడు పరాంకుశం. మరుసటిరోజు సాయంకాలానికల్లా డబ్బు తెచ్చివ్వమనీ, లేకపోతే కథ చాలా దూరం వెళుతుందని హెచ్చరించి వెళ్ళిపోయాడు రాజశేఖరం.

పరాంకుశానికి ఏటూదారి కనిపించలేదు. కరిగిపోయిన రెండులక్షల రూపాయలు తెచ్చి ఇవ్వలేదు. ఇవ్వకుండా జైల్లో కూర్చోలేడు. ఆలోచించగా అతనికి ఒకేదారి దొరికింది. తరువాతెప్పుడో చేయాలనుకున్న పని ఇప్పుడే చేయాలి. అది రాజశేఖరాన్ని పైకి పంపించేయడం!

ఆ ఆలోచన వచ్చిన వెంటనే మారువేషం వేసుకుని రౌడీ మస్తాన్‌ని కలసి మర్డర్ కాంట్రాక్టు కుదుర్చుకొని రాజశేఖరాన్ని రాత్రికి రాత్రే హత్యచేయించాడు.

అయితే శార్లా, పరాంకుశం చెప్పిన అబద్ధాలే వారిని పట్టిచ్చాయి.

వేలిముద్రల సహాయంతో రౌడీ మస్తాన్‌ని పట్టుకున్నాంగాని, హత్య చేయించిన వ్యక్తి ఎవరో తెలియలేదు. తనతో కాంట్రాక్టు కుదుర్చుకున్న వ్యక్తికి ఓకాలు పొట్టిదని రౌడీ మస్తాన్ క్లూ యిచ్చాడు. అది పరాంకుశంకు సరిపోయింది. పైగా అతనికి వ్యసనాలు ఎక్కువ.

హత్య జరిగిన రోజున తన దగ్గర్నుండి రాజశేఖరం రెండులక్షలు తీసుకువెళ్ళాడని అతను బ్లాక్ మెయి-లింగ్‌లో చిక్కుకున్నట్టు అనుమానంగా వుందని చెప్పాడు పరాంకుశం. శార్లాదాన్ని సమర్థిస్తూ అతనికి ఆ రోజు యెక్కడ్నుంచో రెండు ఫోన్ కాల్స్ వచ్చాయని చెప్పింది.

టెలిఫోన్ ఎక్ఛేంజికి ఫోన్ చేసి ఆరోజు ఆ బంగళాకు ఎక్కడెక్కడ్నించి ఫోన్ కాల్స్ వచ్చాయో అడిగాను. పార్వతి (శార్లా) పరాంకుశానికి చేసిన ఫోన్ కాల్ తప్ప వేరొకటేదీ ఆ బంగళాకు ఫోన్ కాల్ రాలేదని తేలింది.

అలాగే హైదరాబాదు బ్యాంకుకు ఫోన్ చేసి రాజశేఖరం అకౌంటులో పదిలక్షలకుపైన బేలన్స్ వున్నట్లు తెలుసుకున్నాను. రెండులక్షలకోసం తన దగ్గరకొచ్చాడన్న పరాంకుశంమాట అబద్ధమని తేలింది.

పరాంకుశాన్ని ఫాలోకమ్మని నరేంద్రను పంపాను.

నరేంద్ర అతనిని బంధించి, పార్వతిని విడిపించి తీసుకువచ్చాడు.

ఇదీ రాజశేఖరం హత్య వెనుకవున్న కథ!'' అని ముగించాడు డిటెక్టివ్ సురేంద్ర.

—:ఐపోయింది:—